TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 354 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ మంగళవారం.21.07.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల తరహాలో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు: సీఎం చంద్రబాబు

### డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు - రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల వల్ల కలిగే లాభాలను ప్రజలకు చెప్పాలి - ఆర్టీజీఎస్‌లో వివిధ శాఖలపై సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి, అమృత్ తెలంగాణ: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారంటూ కొందరు పని గట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని దీనిపై వాస్తవాలను ప్రజలకు తెలపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. రిజిస్ట్రేషన్ సేవలను మరింత సులభతరం చేసేలా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రం–=ాఖలను ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు.

రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్లో వివిధ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలందించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారనే అంశం సమీక్షలో ప్రస్తావనకు వచ్చింది. ఇది ప్రైవేటీకరణ ఎంత మాత్రమూ కాదని స్పష్టంచేశారు. పాస్ పోర్టు సేవా కేంద్రాల తరహాలోనే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు పని చేస్తాయని తెలిపారు. పాస్ పోర్టు సేవా కేంద్రాల పనితీరు ఏ విధంగా జరుగుతుందో, ఆ తర్వాత ప్రక్రియ ఏ విధంగా జరుగుతుందో వివరించాలని సూచించారు.

డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు : పాస్ పోర్టు సేవా కేంద్రాలు అందుబాటులోకి వచ్చాక పాస్ పోర్టు ప్రాసెసింగ్ అనేది చాలా సులువైందన్న సీఎం, ఇదే తరహాలో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల పనితీరు ఉంటుందని తెలిపారు. అయితే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల విషయంలో కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని, ప్రజలకు వాస్తవాలు వివరించే బాధ్యతను అధికారులు తీసుకోవాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల వల్ల కలిగే లాభాలను వివరించాలన్నారు. డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. డాక్యుమెంట్ రైటర్ల ఉపాధికి ఇబ్బంది లేని విధంగా మార్గాలు చూపెడతామని హామీ ఇచ్చారు.

దీపం–2.0 పథక లబ్దిదారులకు ఇచ్చే సబ్సిడీని క్రమపద్దతిలో ఇవ్వాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. ఈ సబ్సిడీని నిర్ధారిత తేదీల్లో ఇచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఈ అంశంపై పౌర సరఫరాల శాఖ–ఆర్థిక శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. దీనికి సంబంధించిన సాంకేతిక అంశాలను పరిశీలించి అమలు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

ప్రాధాన్యతల వారీగా ఆర్థిక సమస్యలను పరిష్కరిద్దాం : లిటిగెంట్ పిటిషనర్లను ఏ విధంగా కట్టడి చేయాలి, ఎలాంటి ప్రజా ప్రయోజనం లేకుండా చేసే ఫిర్యాదుదారులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని సీఎం చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా 81 మంది లిటిగెంట్ పిటిషనర్లు ఉన్నట్టు గుర్తించామన్నారు. వీరు సరాసరి ఒక్కొక్కరు 246 పిటిషన్లు పెడుతున్నారన్నారు. వీరి వివరాలను జిల్లా కలెక్టర్లకు పంపించాలని సూచించారు. వారు పెట్టే అర్జీల్లో ప్రజా ప్రయోజనాలు ఉంటే వాటిని పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వాన్ని, అధికారులను బద్నాం చేసే ఉద్దేశంతో పిటిషన్లు పెట్టే వారిని గుర్తించాలన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో ఆర్థికేతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రాధాన్యతల వారీగా ఆర్థిక సమస్యలను పరిష్కరిద్దామన్నారు. ఈ ఏడాది ఎల్నినో ప్రభావం కారణంగా ప్రస్తుతం 49 శాతం లోటు వర్షపాతం ఉంది. ఈ ప్రభావం నుంచి బయటపడేసే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలన్నారు. ఈ మేరకు రైతుల్లో అవగాహన కల్పించాలని, డ్రై క్రాప్స్ వేసేలా రైతులను ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. వీబీ జీ రామ్ జీ పనులను పెద్ద ఎత్తున చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. జలధార పనులకు వీబీ జీ రామ్ జీ పనుల్ని అనుసంధానం చేయాలన్నారు. ప్రజాభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పని విధానం మార్చుకోవాలని, పరిపాలనా విధానాలను మెరుగుపరుచుకోవాలన్నారు. సమస్యలు ఉత్పన్నమయ్యాక చర్యలు తీసుకోవడంతోపాటు ముందుగానే ఏయే సమస్యలు వస్తాయనే విషయాన్ని అంచనా వేసి దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

## అయోధ్య రామమందిర విరాళాల కేసును రాజకీయం చేయవద్దు : సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ, అమృత్ తెలంగాణ: అయోధ్య రామమందిర విరాళాల కేసుపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసును రాజకీయం చేయవద్దని, కోర్టులు రాజకీయాలకు వేదిక కాదని పేర్కొంది. ఇది ఒక సాధారణ నేరమని, తాము సరైన మార్గంలో దర్యాప్తు జరిగేలా చూస్తామని తెలిపింది. ఈ కేసు దర్యాప్తునకు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సిట్ను ఏర్పాటు చేసిందని, ప్రస్తుతం ఆ రాష్ట్ర పోలీసులు విచారణ చేస్తున్నారని సుప్రీంకోర్టుకు సొలిసిటర్ జనరల్ వెల్లడించారు. కాగా, ఈ కేసుపై సిట్ దర్యాప్తు వివరాలను ఉత్తర్రప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన నేపథ్యంలో, సుప్రీంకోర్టు జులై 27కు విచారణను వాయిదా వేసింది.

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనాలతో కూడిన ధర్మాసనం ఈ కేసుపై విచారణ చేసింది. ఈ సందర్భంగా, అయోధ్య రామమందిర విరాళాల చోరీపై విచారణకు సిట్ చేయవచ్చా? అని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. "మేము చిన్న హెచ్చరిక చేస్తున్నాం. దయచేసి ఈ అంశాన్ని రాజకీయం చేయకండి. కోర్టులు రాజకీయాలకు వేదికలు కాదు. ఇది కేవలం ఒక నేరానికి సంబంధించిన సాధారణ కేసు. సరైన దర్యాప్తు జరిగేలా చూడడవే మా పని'' అని సీజేఐ సూర్యకాంత్ అన్నారు.

అంతకుముందు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్టేటస్ రిపోర్టు దాఖలు చేసిందని తెలిపారు. ''దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటి వరకు ఎనిమిది మందిని అరెస్టు చేశారు. నేను అంత కంటే ఎక్కువ వివరాలు వెల్లడించలేను'' అని చెప్పారు. దీనితో కేసును సిట్ దర్యాప్తు చేస్తోందా అని కోర్టు ప్రశ్నించగా, "వాస్తవాలను తెలుసుకోవడానికి మాత్రమే సిట్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు దీనిని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో ఒక నేరం జరిగిందని మాత్రమే సిట్ కనిపెట్టింది'' అని తుషార్ మెహతా పేర్కొన్నారు.

యూపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆ దర్యాప్తు బృందంలో ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులు, లఖ్నవూ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజీ) సభ్యులుగా ఉన్న విషయాన్ని ధర్మాసనం గమనించింది. నిష్పక్షపాతంగా, పారదర్శకంగా దర్యాప్తు సాగేలా చూడడానికి వారే ఈ ప్రధాన దర్యాప్తును కూడా నిర్వహించవచ్చా? అని కోర్టు ప్రశ్నించింది. పిటిషనర్లలో ఒకరి తరఫున హాజరైన సీనియర్ అడ్వకేట్ దేవదత్ కామత్ తన వాదనలు వినిపిస్తూ, "రామాలయం నిర్మించినప్పుడు ప్రతి ఒక్కరి నుంచి విరాళాలు సేకరించారని మా పిల్లో పేర్కొన్నాం. ఇప్పుడు ఆ విరాళాల రశీదులను భద్రపరచాలని, వాటిని ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని మేము కోరుతున్నాము" అని అన్నారు. ఈ అభ్యర్థనను తాము పరిశీలిస్తామని, వచ్చే సోమవారం ఈ కేసును మళ్లీ విచారణకు స్వీకరించినప్పుడు తగిన ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం పేర్కొంది. జులై 13న ఈ వ్యవహారంలో స్టేటస్ రిపోర్టును సమర్పించాలని ఉత్తరప్రదేశ్ పోలీసులను ధర్మాసనం ఆదేశించింది. అలాగే విరాళాల దొంగతనం ఆరోపణలపై నిష్పక్షపాతంగా, నిర్ణీత కాలపరిమితిలో దర్యాప్తు జరపాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు'కు కోర్టు నోటీసులు జారీ చేసింది.

సీబీఐతో దర్యాప్తు!

ముగ్గురు పిటిషనర్లలో ఒకరైన నరేంద్ర కుమార్ గోస్వామి, ఈ వ్యవహారంపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అంతేకాదు రామమందిర వ్యవహారాలను పర్యవేక్షించే ఈ ట్రస్టు ఆర్థిక లావాదేవీలపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) చేత ఆడిటింగ్ చేయించాలని కూడా ఆయన కోరారు. అజయ్ కుమార్ రాయ్, దినేశ్ కుమార్ యాదవ్ కూడా ఇలాంటి చర్యలనే కోరుతూ రెండో పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐ దర్యాప్తుతోపాటు, ఆర్జేడీ ఎంపీ సుధాకర్ సింగ్ దాఖలు చేసిన మూడో పిటిషన్లో ఆలయ ట్రస్ట్ పూర్తి ఆర్థిక వ్యవహారాలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని కోరారు.

ఎస్బీఐ పర్యవేక్షణలో విరాళాల లెక్కింపు

మరోవైపు, అయోధ్య రామమందిర విరాళాల చోరీ వివాదం నేపథ్యంలో నగదు లెక్కింపునకు ఆలయ ట్రస్ట్ కొత్త బృందాన్ని రంగంలోకి దించింది. విరాళాల పెట్టెల్లోని నగదును, కానుకలను లెక్కించడానికి ఎస్బీఐ పర్యవేక్షణలో రెండు షిఫ్టుల విధానాన్ని ప్రవేశపెట్టినట్లు ఆలయ, బ్యాంక్ వర్గాలు తెలిపాయి. ఒకవారం రోజుల పాటు ట్రయల్స్ నిర్వహించిన తర్వాత ఆదివారం నుంచి ఆ ప్రక్రియ ప్రారంభమైంది. ఆలయ వర్గాల సమాచారం ప్రకారం, ప్రతి షిఫ్టులో 10 నుంచి 12 మందితో కూడిన బృందాన్ని ఏర్పాటు చేశారు. మొదటి షిఫ్టు ఉదయం 8 నుంచి 2 గంటల వరకు, రెండో షిఫ్టు మధ్యాహ్నం 2 నుంచి 8 గంటల వరకు కొనసాగుతుంది. విరాళాల దొంగతనం కేసులో మునుపటి ఇన్ఛార్జ్ సుభాష్ శ్రీవాస్తవ జైలుకు వెళ్లడంతో, ఆయన స్థానంలో నగదు లెక్కింపునకు కొత్త ఇన్ఛార్జ్గా శోభనాథ్ మిశ్రాను ట్రస్ట్ నియమించినట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి.

కేసు పూర్వాపరాలు

అయోధ్య రామమందిర విరాళాల చోరీ ఆరోపణలు వచ్చాయి. దీనితో ఆలయ ట్రస్టు చేసిన అభ్యర్థన మేరకు యూపీ ప్రభుత్వం జూన్ 13న ఈ కేసు విచారణ కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. ఇందులో లఖ్నవూ డివిజనల్ కమిషనర్ విజయ్ విశ్వాస్ పంత్, ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కిరణ్ ఎస్, స్పెషల్ సెక్రటరీ (ఫైనాన్స్) నీల్ రతన్ సభ్యులుగా ఉన్నారు.

## గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఎస్టీ సబ్‌ప్లాన్



ఇల్లందు :అమృత్ తెలంగాణ: ఆదిలాబాద్ నుంచి భద్రాచలం వరకూ విస్తరించిన గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం ఎస్టీ సబ్‌ప్లాన్ ద్వారా విస్తృత కార్యక్రమాలు అమలు చేస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పోడు భూముల హక్కులు పొందిన గిరిజన రైతుల వ్యవసాయాభివృద్ధి కోసం 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకం ద్వారా ఉచిత సౌర విద్యుత్, బోర్ బావులు, పంపుసెట్లు, డ్రిప్, స్ప్రింక్లర్ ఇరిగేషన్ సౌకర్యాలు కల్పిస్తున్నట్టు వివరించారు. అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలో భాగంగా ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు, టేకులపల్లి, ఖమ్మం జిల్లా కామెపల్లి మండలంలో పర్యటించారు. తొలుత జిల్లా పర్యటనకు విచ్చేసిన భట్టి విక్రమార్కకు కలెక్టర్ అంకిత్ మర్యాదపూర్వకంగా పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఇల్లందు మండలం పాత రొంపేడు గ్రామంలో నూతనంగా రూ.3కోట్ల 25 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో భట్టి మాట్లాడారు.

వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న మార్పుల కారణంగా రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతున్నప్పటికీ, ప్రజలకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేలా విద్యుత్ శాఖ అప్రమత్తంగా పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేస్తూ విద్యుత్ మౌలిక సదుపాయాలను వేగంగా విస్తరిస్తున్నట్టు తెలిపారు.


ఎల్‌నినో ప్రభావంపై శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో అన్ని శాఖలు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించడంలో మీడియా, అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్) చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ రెడ్డి, ఎస్పీ రోహిత్ రాజు, ఇల్లందు, వైరా ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, రామదాస్ నాయక్, విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డెడ్ స్టోరేజ్‌లో నీళ్లు.. కోల్డ్ స్టోరేజ్‌లో ప్రభుత్వం.. రేవంత్ రెడ్డిపై కేటీఆర్ హాట్ కామెంట్స్



హైదరాబాద్, అమృత్ తెలంగాణ: తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్ఎస్ ముఖ్యనేతల సమావేశంలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ద్వారా గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన పోచారం పరిస్థితి ప్రస్తుతం 'కుడితిలో పడిన ఎలుకలా' తయారైందని, ఆయన తన రాజకీయ భవిష్యత్తును తానే సమాధి చేసుకున్నారని విమర్శించారు. బాన్సువాడలో త్వరలోనే మళ్లీ గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు దేవుళ్లపై ఒట్టు వేసి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారని, ఏ సభ పెట్టినా కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, యూరియా అందక ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని రెండు పిల్లర్లు కుంగి 31 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు మరమ్మతులు ఎందుకు చేయలేదని నిలదీశారు. రిజర్వాయర్లు డెడ్ స్టోరేజ్‌కు చేరుతుంటే రేవంత్ ప్రభుత్వం కోల్డ్ స్టోరేజ్‌లోకి వెళ్లిపోయిందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన ఉద్యోగాల నియామకాలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఖాతాలో వేసుకుంటోందని, ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ ఎల్లప్పుడూ పోరాడుతుందని స్పష్టం చేశారు.

## తిరుమలకు భారీగా భక్తుల రాక... 31 కంపార్ట్‌మెంట్లు ఫుల్



అమృత్ తెలంగాణ: తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న రద్దీ సోమవారం కూడా తీవ్రస్థాయిలో ఉంది. దీంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని మొత్తం 31 కంపార్ట్‌మెంట్లు భక్తులతో పూర్తిగా నిండిపోయాయి. ప్రస్తుతం టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి సుమారు 18 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. నిన్న ఆదివారం (జులై 19) ఒక్కరోజే 90,956 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామివారికి 33,046 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.05 కోట్లుగా నమోదైంది. రద్దీకి అనుగుణంగా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఆదివారం నాడు టీటీడీ మొత్తం 4.44 లక్షల లడ్డూలను భక్తులకు విక్రయించింది. అదేవిధంగా, 2.94 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేసింది. యాత్రికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వైద్య కేంద్రాల ద్వారా 3,708 మందికి వైద్య సేవలు అందించినట్లు టీటీడీ వెల్లడించింది. భక్తుల రద్దీ కొనసాగుతున్నందున, యాత్రికులు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాన్ని ప్రణాళిక చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# సమష్టిగా నిలబడి ఎల్-నినోను ఎదుర్కొందాం

## రైతులు, ప్రజల రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం - అన్ని శాఖలు మిషన్ మోడ్‌లో పనిచేయాలి : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి ఇల్లంబర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేక ఇల్లం బర్తీ



సమావేశానికి హాజరైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధికారులు

అమృత్ తెలంగాణ ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో న్యూస్ ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో మిషన్ మోడ్‌లో పనిచేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల ప్రత్యేక అధికారి ఇల్లంబర్తి అధికారులను ఆదేశించారు. ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు, కంటింజెన్సీ ప్లాన్‌లను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా వర్షాభావ పరిస్థితులను ఎదుర్కోవచ్చని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్, నిర్మల్, కుమురం భీం-ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన ఎల్-నినో సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ప్రత్యేక అధికారికి జిల్లా కలెక్టర్లు, అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ, ఎల్-నినో ప్రభావాన్ని వ్యవసాయ రంగానికే పరిమితం చేయకుండా తాగునీరు, సాగునీరు, విద్యుత్, పశుసంవర్ధక, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, ఉద్యానవనం, భూగర్భ జలాలు, ఇరిగేషన్ తదితర అన్ని రంగాలపై ప్రభావం చూపే పరిస్థితిగా భావించి శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామ గ్రామాన రైతులకు వర్షాభావ పరిస్థితులు, నీటి వినియోగం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృత అవగాహన కల్పించాలని, కందులు, పెసర్లు, నువ్వులు, వేరుశనగ, చిరుధాన్యాలు, ఉద్యాన పంటలను ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లాల వారీగా జలాశయాల నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి లభ్యత, సాగునీటి పరిస్థితులు, విద్యుత్ సరఫరా, పంటల స్థితిగతులను సమీక్షించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, ప్రజల్లో నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మున్సిపల్, తాగునీరు, విద్యుత్, వైద్యం, భూగర్భ జలాలు, ఇరిగేషన్, మహిళా శిశు సంక్షేమం, కృషి విజ్ఞాన కేంద్రం తదితర శాఖలు తమ యాక్షన్ ప్లాన్‌లు, కంటింజెన్సీ ప్రణాళికలను సిద్ధం చేసి అమలు చేయాలని ఆదేశించారు. ప్రస్తుత అంచనాల ప్రకారం 40--45 శాతం వరకు వర్షపాత లోటు నమోదయ్యే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు, ప్రజలను కాపాడుకోవడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజాప్రతినిధులు, అధికారులు, అన్ని శాఖల సిబ్బంది సమష్టిగా పనిచేస్తే ఎల్-నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోగలమని ప్రత్యేక అధికారి అన్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, ఫామ్ పాండ్ల ఏర్పాటుతో భూగర్భ జలాలను పెంచాలని సూచించారు. తక్కువ నీటి అవసరమున్న ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తూ, ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో సిల్టేషన్ తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులు యూరియా బుకింగ్ యాప్‌లో నమోదు చేసుకుని అవసరమైన ఎరువులు పొందాలని సూచించారు. నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ, భూగర్భ జలాల పరిరక్షణకు సమష్టి కృషి అవసరమన్నారు. రైతులు 8ఐ8ఐ2 మీటర్ల ఫామ్ పాండ్లు ఏర్పాటు చేసి వర్షపు నీటిని భద్రపరచాలని, జిల్లాలో పెద్దఎత్తున నీటి సంరక్షణ చర్యలు చేపడితే భవిష్యత్ తాగునీటి, సాగునీటి అవసరాలను తీర్చవచ్చని తెలిపారు. కంది వంటి తక్కువ నీటి అవసరమున్న పంటలను ప్రోత్సహించాలని సూచించారు. కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలను చేరవేయాలని, అన్ని శాఖలు సమన్వయంతో కార్యాచరణ ప్రణాళికలను అమలు చేయాలని, అత్యవసర పరిస్థితులకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వం మిషన్ మోడ్‌లో పనిచేస్తోందని, పత్తి సాగు దెబ్బతిన్న ప్రాంతాల్లో రైతులు కందులు, పెసర్లు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. నీటి నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ అవసరమైన సహాయక చర్యలు చేపడతామని తెలిపారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, తాగునీరు, సాగునీటి సమస్యల పరిష్కారానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. కడెం ప్రాజెక్టు నీటి నిల్వలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పైపులైన్ లీకేజీలను వెంటనే మరమ్మతు చేసి నీటి వృథాను నివారించాలని సూచించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ శాఖల యాక్షన్ ప్లాన్‌లు, కంటింజెన్సీ ప్రణాళికలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఎల్-నినో బుక్‌లెట్, తెలంగాణ జలసిరి పోస్టర్లను ప్రత్యేక అధికారి, కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్. ఎస్ చిత్రు, బి. వెంకటేశ్వర్లు, పి. చంద్రయ్య, యువరాజ్ మర్మట్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధరణి మధుకర్, క్యాతన పల్లి మున్సిపల్ చైర్ పర్సన్ సంధ్యారాణి, చెన్నూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పి.పద్మ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బరంపూర్ గ్రామ బ్రిడ్జి సమస్యను పరిశీలించిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్



పరిశీలిస్తున్న ఆడే గజేందర్

అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ నిన్న తలమడుగు మండలంలోని బరంపూర్ గ్రామంలో SIR పై కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించి తిరుగు ప్రయాణంలో ఉన్న సందర్భంగా గ్రామస్తులు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ ని మర్యాదపూర్వకంగా కలిసి గ్రామంలోని బ్రిడ్జి సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు గ్రామస్తుల విజ్ఞప్తికి వెంటనే స్పందించిన ఆడే గజేందర్ గారు వారితో కలిసి బ్రిడ్జి వద్దకు వెళ్లి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. బ్రిడ్జి పైభాగంతో పాటు క్రిందికి వెళ్లి సమస్య తీవ్రతను తన చరవాణి (మొబైల్ ఫోన్)లో ఫోటోలు తీసి నమోదు చేసుకున్నారు ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ, గ్రామస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు గారి దృష్టికి తీసుకెళ్లి, బ్రిడ్జి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు తాము సమస్యను వివరించిన వెంటనే ఎలాంటి ఆలస్యం చేయకుండా తమతో కలిసి బ్రిడ్జి వద్దకు వచ్చి, స్వయంగా పరిశీలించి, ఫోటోలు తీసి సమస్య పరిష్కారానికి ముందుకు రావడం పట్ల బరంపూర్ గ్రామ రైతులు, గ్రామస్తులు ఆడే గజేందర్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వెంటనే స్పందించడం ఆయన ప్రజా సేవకు నిదర్శనమని వారు అభినందించారు

# "అతిథి" అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



మెట్టుపల్లి అమృత్ తెలంగాణ జూలై 20: తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ - కళాశాల విద్యా కమీషనర్ ( సీసీఈ) శ్రీమతి అల్లంరాజు శ్రీ దేవసేన మరియు మల్టీ జోన్ - I,జాయింట్ డైరెక్టర్ (జేడీ) ప్రొఫెసర్ డీ.ఎస్.ఆర్. రాజేందర్ సింగ్ లు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న నాలుగు పోస్టులలో అతిథి అధ్యాపకుల నియామకం కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని,ఈ నెల 23 వ తేదీ లోపు తమ దరఖాస్తులను కళాశాల కార్యాలయంలో సమర్పించాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వేంకయ్య తెలిపారు. సోమవారం రోజున ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కళాశాలలో తెలుగు, రాజనీతి శాస్త్రం, వాణిజ్య శాస్త్రం, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ లలో పోస్టులు ఖాళీగా ఉన్నాయని,ఆ పోస్టులలో అతిథి అధ్యాపకులను నియమించడానికి ఈ నెల 23 వ తేదీ మధ్యాహ్నం 3 గంటల లోపు అర్హత గల అభ్యర్థులు కళాశాల కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని ఆయన వివరించారు.కాగా సంబంధిత సబ్జెక్టులలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీ.జీ)తో పాటు యూ జీ సీ నెట్,సెట్,పీహెచ్.డి వంటి అర్హతలు గల అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని అన్నారు.దరఖాస్తుతో పాటు తమ బయోడేటా మరియు అర్హత,అనుభవం వంటి అన్ని సర్టిఫికెట్ల "జిరాక్స్ కాపీల సెట్"ను విధిగా సమర్పించాలని ఆయన స్పష్టంగా పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 24 వ తేదీన అనగా శుక్రవారం రోజున అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో నేరుగా జగిత్యాల పట్టణంలోని ఎస్ కే ఎన్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ ఢ పీ.జీ కళాశాలలో ఉదయం 10 గంటలకు విధిగా హాజరు కావాలని ఆయన స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు ఆలస్యంగా వస్తే మాత్రం వారి దరఖాస్తులను పరిశీలించడం జరగదన్నారు.ఇంకా ఇతర వివరాల కోసం మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వేంకయ్య అభ్యర్థులకు సూచించారు. ఈ సమావేశంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తొంటి దేవన్న, కళాశాల అకాడమిక్ కో- ఆర్డినేటర్ బిల్ల రాజేందర్, కామర్స్ హెచ్ఓడీ ఏ.మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# ప్రైవేట్ దవాఖానలలో ఫీజుల నియంత్రణ చేపట్టాలి : నిర్మల్ జిల్లా అంబెడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బత్తుల రంజిత్




అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్ కు వినతి పత్రం అందజేస్తున్న అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బత్తుల రంజిత్




ప్రైవేటు హాస్పిటల్ లలో ఫీజులు తగ్గించాలని మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వివిధ సంఘాల నాయకులు

నిర్మల్ జిల్లా జులై 20 అమృత్ తెలంగాణ, నిర్మల్ జిల్లా లో గల అన్ని ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటల్ లలో ఫీజుల నియంత్రణ చేపట్టాలి అని అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల రంజిత్, అన్నారు,

సోమవారం రోజు ప్రజా వానిలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, కు వినతి పత్రం అందజేశారు,

ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా లోని అన్ని ప్రైవేట్ హాస్పిటల్ లు మరియు రక్త పరీక్షలు చేసే ల్యాబ్ లలో ఒక్కొ హాస్పిటల్ లో ఒక్కో టెస్ట్ కి అధిక డబ్బులు వసూలు చేస్తున్నారని అక్కడ కూడా ధరల పట్టికను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో BSI జిల్లా అధ్యక్షుడు మురళీధర్, మల్లేశ్వర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజావాణి లో ఇచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్ రెవెన్యూ



ప్రజావాణికి హాజరైన అన్ని శాఖల అధికారులు

నిర్మల్ జిల్లా జులై 20 అమృత్ తెలంగాణ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను అదనపు కలెక్టర్ కు సమర్పించారు ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మెట్‌పల్లిలో ఘనంగా త్రిశక్తి దేవాలయ పంచమ వార్షికోత్సవం











మెట్టుపల్లి అమృత్ తెలంగాణ జూలై 20: మెట్‌పల్లి పట్టణంలో శ్రీ త్రిశక్తి దేవాలయ పంచమ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా TPCC రాష్ట్ర సీనియర్ నాయకులు గౌ"శ్రీ జువ్వాడి కృష్ణారావు మరియు మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ గౌ"శ్రీ మైలారపు లింబాద్రి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీ ఓంకార్ నవీన్, నాయకులు బత్తుల నరేష్, పందిరి రమేష్, గుడికంధుల అజయ్, నాయకులు ముఖీం, అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆలయ నిర్వాహకులు ధ్యావనపల్లి రాజారాం, ఉడుత శ్రీనివాస్, అన్నం నాగరాజ్, బేతు భాస్కర్ తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు హాజరై అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

# మాజీ మంత్రి చిలుకూరి రామచంద్రారెడ్డి కి ఘన నివాళులర్పించిన ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి



నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసి చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ అభివృద్ధి ప్రదాత, మాజీ మంత్రి స్వర్గీయ చిలుకూరి రామచంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఘన నివాళులర్పించారు. జిల్లాకేంద్రంలోని శాంతినగర్ లో రామచంద్రారెడ్డి నివాసంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సీఆర్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాసేవకు అంకితమైన రామచంద్రారెడ్డి సేవలు చిరస్మరణీయమైనవని కొనియాడారు. ఆదిలాబాద్ ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన విశేష కృషిని గుర్తుచేసుకున్నారు. రామచంద్రారెడ్డి ఆశయాలు, రాజకీయ విలువలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో రామచంద్రారెడ్డి సోదరుడు లక్ష్మారెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, టౌన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఖిజర్ పాషా, మాజీ మున్సిపల్ చైర్మన్ దిగంబర్ రావ్ పాటిల్, మావల సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్, నాయకులు నాగరాజు, దుర్గం శేఖర్, గుడిపల్లి నగేష్, గౌలి సంజయ్, యాకుబ్ బాయ్, అశోక్, సంజయ్, రెండ్ల రాజన్న, ఎస్.కె. అలీం, సూరం మోహన్, దీపక్ రావు, భూమారెడ్డి, భోజారెడ్డి, బండి దేవిదాస్ చారి, సుధాకర్ గౌడ్ , రవి ,అసీమ్, అజీస్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీసీసీ కార్యాలయంలో జరిగిన సీఆర్ఆర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# టైమ్ మెషిన్ ఎక్కి పాతికేళ్లు వెనక్కి..సిల్వర్ జూబ్లీ హంగామా!




ఆదిలాబాద్ గ్రామీణం మండలం చాందటి గురువులతో 2000 సంవత్సరంలో టెన్త్ క్లాస్ బ్యాచ్ తో విద్యార్థిని విద్యార్థులు




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి: పాతికేళ్ల క్రితం విడిపోయిన క్లాస్‌రూమ్ స్నేహం.. మళ్లీ ఒక్కటై సందడి చేసింది. 1999-2000 పదో తరగతి చందా (T) బ్యాచ్ విద్యార్థులు తమ పాఠశాల చదువు పూర్తి చేసుకుని 25 వసంతాలు (సిల్వర్ జూబ్లీ) విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఎంతో ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. రెండున్నర దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత ఒకే వేదికపైకి చేరిన నాటి మిత్రులు, ఒక్కసారిగా తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనాటి మధుర క్షణాల్లోకి వెళ్లారు. ఒకరినొకరు కౌగిలించుకుని, క్షేమ సమాచారాలను పంచుకుంటూ చిన్నపిల్లల్లా మురిసిపోయారు. ప్రస్తుతం జీవితంలో వివిధ ఉన్నత రంగాల్లో స్థిరపడినప్పటికీ, తామంతా చిన్ననాటి దోస్తులమేనని, ఆ స్నేహమే అన్నిటికన్నా మిన్న అని చాటుతూ సిల్వర్ జూబ్లీ వేడుకను ఒక మధుర జ్ఞాపకంగా మార్చారు. ఈ వేడుకలో భాగంగా తమకు క్రమశిక్షణతో కూడిన విద్యాబుద్ధులు నేర్పి, సమాజంలో ఉన్నత స్థానంలో నిలబెట్టిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించి, వారి పాదాభివందనం చేసి ఆశీస్సులు తీసుకున్నారు.

# తక్కువ నీటితో పండే పంటలపై అవగాహన కల్పించాలి

## అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి

## ఎల్‌నియో ప్రభావంపై నల్గొండ జిల్లా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన ఇంచార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్







నల్గొండ: అమృత్ తెలంగాణ జూలై 20:తక్కువ నీటితో సాగు అయ్యే పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని నల్గొండ జిల్లా ఇన్ చార్జీ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఎల్ నియో ప్రభావంపై ఉమ్మడి నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో చేపట్టాల్సిన చర్యలు, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, తాగునీరు, సాగునీటి నిర్వహణతో పాటు ఇతర సంబంధిత అంశాలపై నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి, నల్లగొండ జిల్లా ఇంచార్జ్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మూడు జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల, పశుసంవర్ధక తదితర శాఖలఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఎల్‌నియో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని శాఖల సమన్వయంతో కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందని తెలిపారు రైతులు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు, సాగునీటి నిర్వహణ, తాగునీటి సరఫరా, పశుగ్రాసం వంటి అంశాలపై ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా పనిచేయాలని, మూడు జిల్లాల అధికారులు పరస్పర సమన్వయంతో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.

# సీసీఐ సాధనే అంతిమలక్ష్యం

## జోగురామన్న ఆమరణ దీక్షకు అండగుంటాం

## రాష్ట్రప్రభుత్వం తనవైఖరి స్పష్టం చేయాలి : సీసీఐ సాధన కమిటీ



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బాశెట్టి మాధవరావు విజ్ఞానకేంద్రం ,సీఐటీయూ కార్యాలయంలో సీసీఐ సాధన కమిటీ కో కన్వీనర్ విజ్జగిరి నారాయణ అధ్యక్షతన , సీసీఐ ప్రస్తుత పరిస్థితులు -భవిష్యత్తు కార్యాచరణపై చర్చాగోష్ఠి కార్యక్రమం నిర్వహించారు . ఈ చర్చాగోష్ఠిలో సీసీఐ సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేష్ గత నాలుగు సంవత్సరాలుగా సీసీఐ సాధన కమిటీ నిర్వహించిన పోరాటాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పెంచిన వత్తిళ్లు ,కేంద్రం నుండీ రాబట్టిన హామీ గురించి వివరించి భవిష్యత్తు పోరాట కార్యాచరణ ప్రవేశ పెట్టారు . హాజరైన ప్రముఖులు కార్యాచరణను బలపరుస్తూ మాట్లాడారు . మాజీ మంత్రి జోగురామన్న మాట్లాడుతూ సీసీఐ సాధన కోసం గత నాలుగేళ్లుగా సీసీఐ సాధన కమిటీ సాగిస్తున్న నిర్విరామ పోరాటాన్ని అభినందించారు .ముందునుండి నేను ఈ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొంటున్నాను భవిష్యత్తులో కూడా పాల్గొంటాను , సీసీఐ సాధన కోసం అంతిమయుద్ధం అయినా ఆమరణ నిరాహారదీక్షకు పూనుకుంటానని తెలియజేశారు . కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిపట్ల శ్రద్ధ ఉంటె తక్షణం సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు .సీసీఐ పరిశ్రమ ప్రారంభించబడితే నిరుద్యోగులకు ఉద్యాగాలు దొరుకుతాయి పరిశ్రమలో 80 శాతం ఉద్యోగాలు స్థానికులతో నింపుతారని తద్వారా మన జిల్లా యువకుల వలసలు ఆగిపోతాయని అన్నారు. పట్టణం పారిశ్రామిక అభివృద్ధి సాధించాలన్న సీసీఐ పరిశ్రమను తక్షణం తెరిపించాలని ఆయన డిమాండ్ చేశారు .ఎన్నికల్ల సమయంలో రాజకీయాలు చేద్దాం అభివృద్ధికీ ఉపయోగ పడే సీసీఐ పరిశ్రమ తెరిపించడంలో కలిసిరావాలని స్థానిక ఎం .ఎల్ .ఏ. కు హితవుపలికారు . రాష్ట్రం సహకరిస్తలేదని కేంద్ర మంత్రీ చెపుతున్నందున్న కాంగ్రెస్ పెద్దలు స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు .

జిల్లాలో ఉన్న రెండు ప్రభుత్వ సంస్థలు మూతపడటం బాధాకరం

రంగన్న రిటైర్ టీచర్

జిల్లాలో కేంద్ర ప్రభుత్వం పరిధిలో సీసీఐ ,రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో స్పిన్నింగ్ మిల్లు ఈ రెండింటిలో ఒకటి ప్రైవేటీకరణ కావడం మరొకటి మూతపడటం బాధాకరం అని రంగన్న ఆవేదన వ్యక్తం చేశారు . సీసీఐ పరిశ్రమ తెరిపించే పోరాటంలో తనవంతు భాగస్వామ్యం ఉంటుందని ఆయన అన్నారు .

సీసీఐపోరాటంన్యాయమైనది

రిటైర్ టీచర్ ఉమాకాంత్

సీసీఐ పరిశ్రమ తెరిపించాలని జరుగుతున్న పోరాటం న్యాయమైనది అని రిటైర్ టీచర్ ఉమాకాంత్‌య అన్నారు .వెనుకబడిన ఆదిలాబాద్ అభివృద్ధికి సిమెంట్ పరిశ్రమ వెన్నుముకగా పనిచేస్తుందని అన్నారు సీసీఐ సాధన పోరాటంలో తానుకూడా భాగస్వామి అవుతానని అన్నారు .

పాలకులు నిర్లక్ష్యం తగదు

నర్సింములు రిటైర్ ఉద్యోగి

సీసీఐ రీఓపెన్ చేయడం పట్ల కేంద్ర ,రాష్ట్ర పాలకులు నిర్లక్ష్యం చేయడం తగదని వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు .

సీసీఐ పరిశ్రమ పోరాటానికి మున్నూరు కాపులు అండగా నిలుస్తారు

శివన్న మున్నూరు కాపుల సంఘం అధ్యక్షులు

ఆనాడు సీసీఐ పరిశ్రమకు భూములు త్యాగం చేసిన వారిలో మున్నూరు కాపులు ఎక్కువ మందే ఉన్నారన్నారు . సీసీఐ పరిశ్రమ పునర్ ప్రారంభం అయితే భూనిర్వాసితులతో పాటు ప్రతీ కుటుంబలో ఉద్యోగం వచ్చే అవకాశం ఉందన్నారు .సీసీఐ పోరాటంలో మున్నూరు కాపు సంఘం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు .

నిరుద్యోగ యువతకు వరం సీసీఐ ప్రారంభం

ఎర్రం నర్సింగ్

సీసీఐ పరిశ్రమ పునర్ ప్రారంభం నిరుద్యోగ యువతకు ఒక వరం లాంటిదని ,ప్రస్తుతం సాంకేతిక విద్యను అభ్యసించిన వారు మన జిల్లాలో ప్రతికుటుంభంలో ఒకరు ఉన్నారని అలాంటి నిరుద్యోగులకు సీసీఐ పరిశ్రమలో ఉద్యోగాలు దొరికే అవకాశం ఉంటుందని అందుకోసం ఈ పోరాటంలో నిరుద్యోగ యువత అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు . దళిత యువకులకు ఉపాధి లభిస్తుంది

దర్శనాల నగేష్ అంబేద్కర్ సంఘాల ఐక్య పోరాటం కమిటీ ప్రధాన కార్యదర్శి

దళితులు ,వెనుకబడిన కులాల పిల్లలు ఉపాధి కోసం వలసలు వెళుతున్నారు . సీసీఐ పరిశ్రమ ప్రారంభించబడితే స్థానికంగానే వేలాది మందికి ఉపాధి లభిస్తుందని , అందుకోసం కేంద్ర ,రాష్ట్రప్రభుత్వాలు తమ అలసత్వాన్ని వీడి తక్షణం సీసీఐ పునరుద్ధరణకు నిధులు కేటాయించాలని అన్నారు .దళితులతో ఓట్లు వేయించుకుంటున్న పాలకులు వారికీ ఉపాధి చూపించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు .

భూములుకోల్పోయికూలీలుగామారాముఈశ్వర్ దాస్ ,అరుణ్ కుమార్

ఆనాడు పరిశ్రమలో ఉద్యోగాలు కల్పిస్తాము అంటే ఉన్నభూములను పరిశ్రమకు అప్పగించాము.

వందేళ్ళు పరిశ్రమ నడుస్తుందని నమ్మబలికి పద్నాలుగు ఎండ్లకే మూతేసి మాకు అన్యాయం చేశారు .భూములు ఉద్యోగాలు కోల్పోయి కూలీలుగా మారమని ఆవేదన వ్యక్తం చేశారు .ఇప్పటికైనా కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమను తెరిపించాలి లేదా మా భూములు మాకు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు .

మహిళలం అండకుంటాము మహిళా సంఘం నేతలు ఆర్ మంజుల, స్వరూప

సీసీఐ సాధన పోరాటంలో మహిళలు అండగా నిలుస్తామని మహిళా సంఘం నేతలు ఆర్ .మంజుల ,స్వరూప అన్నారు . వెనుకబడిన పరిశ్రపునరుద్దరణకు కేంద్రం చొరవ చూపాలని స్థానిక ఎంపీ ,ఎం .ఎల్ .ఏ .లు కృషి చేయాలనీ ఎన్నికల్లో వారు ఇచ్చిన హామీనీ అమలు చేయాలనీ డిమాండ్ చేశారు .

రైతులు పోరాటంలో పాల్గొనాలి

బండి దత్తాత్రి ,లోకరీ పోశెట్టి ,సంగేపు బొర్రన్న

సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ పోరాటం జిల్లా పారిశ్రామిక అభివృద్ధికోసం జరుగుతున్న పోరాటం అన్నారు . నిరుద్యోగుల భవిష్యత్తు మార్చే పోరాటం అన్నారు .ఈ పోరాటంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు .

పద్మశాలీలుఅండగుంటారు దాసరి రమేష్

జిల్లా ప్రజల అభివృద్ధికోసం జరుగుతున్నా న్యాయమైన సీసీఐ సాధన పోరాటంలో పద్మశాలీలు అండగా నిలుస్తారని ఇదివరకు జరుగుతున్నా పోరాటంలో కులస్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొంటున్నారని గుర్తుచేశారు.

విద్యార్థి ,యువజనులు ఉద్యమిస్తారు

విద్యార్థి ,యువజనులు ఉద్యమిస్తారని విద్యార్థి సంఘాల నేతలు బుట్టిశివకుమార్ , ప్రశాంత్ , గణేష్,దీపాలక్ష్మి అన్నారు . బీజేపీ ప్రభుత్వం తక్షణమే సిమెంట్ పరిశ్రమ ను పునరుద్ధరిస్తూ ప్రకటన చేయాలనీ వారు డిమాండ్ చేశారు .

వామపక్షాలు ముందుటాయి

సీసీఐ సాధన పోరాటంలో వామపక్షాలు ఎల్లప్పుడూ ముందుపీటనే ఉన్నాయని భైష్యత్తులోను ఉంటాయని వామపక్షాల నాయకులు అరుణ్ కుమార్ ,వెంకట్ నారాయణ ,జగన్ సింగ్ అన్నారు .

కార్మికులను కదిలిస్తాశీ అన్నమొల్ల కిరణ్

సీసీఐ పరిశ్రమ పునర్ ప్రారంభం కోసం సాగుతున్న పోరాటంలో అన్నిరంగాల కార్మికులను కదిలిస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు .

ఆదివాసులు ఉద్యమిస్తారు పూసం సచిన్

ఆదివాసుల జిల్లా అత్యంత వెనుకబడిన జిల్లాలో ఉన్న ఏకైక కేంద్ర ప్రభుత్వ సంస్థను మూసివేయడం నాటి పాలకుల చారిత్రక తప్పిదం అన్నారు .

ఆదివాసీ యువతకు ఉద్యోగావకాశాలు దక్కాలంటే సిమెంట్ పరిశ్రమను పునరుద్దరించాలని ఆయన డిమాండ్ చేశారు .పోరాటంలో ఆదివాసీ యువత పాల్గోనాలనీ ఆయన పిలుపునిచ్చారు .

కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాను మునిగేల నర్సింగ్

కేంద్రం 250 కోట్లు , రాష్ట్రం 250 కోట్లు ఇవ్వాలన్న ప్రతిపాదనపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ,సీసీఐ సాధన కమిటీని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రీ దగ్గరకు తీసుకెళ్తానని ఆయన అన్నారు .

# ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షనర్స్ కు ఆరోగ్య కార్డులు






జగిత్యాల అమృత్ తెలంగాణ జూలై 20: జగిత్యాలలో పెన్షనర్లకు హెల్త్ కార్డుల పంపిణీ: పాల్గొన్న ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ సన్మానించిన పెన్షనర్స్ యూనియన్ సభ్యులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన హెల్త్ కార్డుల పంపిణీ కార్యక్రమం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఘనంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర పెన్షనర్ల సంఘం జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై, పెన్షనర్లకు నూతన హెల్త్ కార్డులను పంపిణీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే ఈ నూతన హెల్త్ కార్డులను అందిస్తోందని తెలిపారు. పెన్షనర్లు ఈ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు బోలుశాని శ్రీనివాస్, కుతురు శేఖర్, కో-ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్, పెన్షనర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు.

# బ్యాంకు ఉద్యోగులు నిరసన




అమృత్ తెలంగాణ మంచిర్యాల న్యూస్ సిసిసి నస్పూర్ లోనీ యూనియన్ బ్యాంక్ విశ్రాంత కార్మికులు ప్రమాద బీమా గురించి బ్యాంకు మేనేజర్ కి మెమోరాండం ఇవ్వడం ఇవ్వడం జరిగింది దీనికి బ్రాంచ్ మేనేజర్ మరియు విశ్రాంత కార్మికులు ప్రమాద బీమా చనిపోయిన వ్యక్తికి 30 లక్షలు 2024 నుండి అమలులో ఉన్న కార్మికులకు అవగాహన లేకపోవడం దీనిపై బ్యాంకులు అవగాహన సదస్సులు కల్పించకపోవడం వలన కృష్ణ అంత కార్మికులు చనిపోతే వారికి బీమా షరతులు తెలియజేయడం జరిగింది . దీనికి విశాఖపట్నం విశ్రాంతి కార్మికుల సంఘం నాయకులు సహ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో వారి నిరసన తెలియజేయడం జరిగింది

# కాంగ్రెస్ ఎస్సీ సెల్ నిర్మల్ జిల్లా జనరల్ సెక్రటరీగా కాల్వ రఘు

నిర్మల్ జిల్లా జులై 20: అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్‌లో కీలక నియామకాలు జరిగాయి. జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ జనరల్ సెక్రటరీగా కాల్వ రఘు, నర్సాపూర్ (జి) మండల ఎస్సీ డిపార్ట్మెంట్ అధ్యక్షుడిగా గడ్డం అశోక్, నియమితులయ్యారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ అధ్యక్షుడు కట్ట శ్యాంప్రసాద్, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ డిపార్ట్మెంట్ వైస్ ప్రెసిడెంట్ తూర్పాటి వెంకటేష్, రాష్ట్ర కార్యదర్శి కొంతం గణేష్ చేతుల మీదుగా నూతనంగా నియమితులైన నాయకులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ఎస్సీ వర్గాల సంక్షేమం కోసం నూతన బాధ్యతలు చేపట్టిన నాయకులు సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. కాల్వ రఘు, గడ్డం అశోక్ తమపై పార్టీ నాయకత్వం ఉంచిన నమ్మకానికి అనుగుణంగా పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతనంగా నియమితులైన నాయకులను అభినందించారు.

# బాధిత కుటుంబలను పరామర్శించిన సారంగాపూర్ మాజీ జడ్పీటీసీ పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి





బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ జెడ్పిటిసి పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి

నిర్మల్ జిల్లా సారంగాపూర్ జులై 20 అమృత్ తెలంగాణ సారంగాపూర్ మండలం లోని తాంఢ్ర. జి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త జగత్ ప్రసాద్ తల్లి గత ఐదు రోజుల క్రితం మరణించిన రు అలాగే వైకుంఠ పూర్ (ధోనిగమ్ ) గ్రామానికి చెందిన గ్రామ కారోబార్ చుక్క బోట్ల రాజేశ్వర్ మూడు రోజుల క్రితం గుండె పోటుతో మరణించడంతో వేరు వేరుగా రెండు గ్రామ లలో వారి కుటుంబ సభ్యులను సోమవారం రోజున సారంగాపూర్ మాజీ జడ్పీటీసీ సభ్యుడు పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియ జేసినారు. వారి కుటుంబలకు అండగా ఉంటామని అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైకుంఠ పూర్ గ్రామ సర్పంచ్ జంగం ఆనంద్, సారంగాపూర్ మార్కెట్ డైరెక్టర్ సాదప్రశాంత్, గుర్రాల రాజేశ్వర్,చిన్నయ్య, మోహన్, లింగయ్య, గజానంద్, కాంగ్రెస్ పార్టీ సారంగాపూర్ మండల సోషల్ మీడియ కో ఆర్డినేటర్ సాక్ పెల్లి సురేందర్ తదితరులు ఉన్నారు.

# గన్‌తో కాల్చుకుని..త్రిపుర డీజీపీ అనురాగ్ ధన్కడ్ ఆత్మహత్య



త్రిపుర డిజిపి అనురాగ్ ధన్కడ్, ఫైల్ ఫోటో

అమృత్ తెలంగాణ రాష్ట్ర డీజీపీగా విధులు నిర్వహిస్తున్న అనురాగ్ ధన్కడ్ ఆత్మహత్య చేసుకొని ప్రాణాలు కోల్పోయారు. అగర్తలాలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆయన తన సర్వీస్ తుపాకీతో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. త్రిపుర రాష్ట్రంలో సోమవారం ఉదయం ఒక షాకింగ్ ఘటన వెలుగు చూసింది. రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా విధులు నిర్వహిస్తున్న సీనియర్ ఐపీఎస్ అధికారి అనురాగ్ ధన్కడ్ ఆత్మహత్య చేసుకొని ప్రాణాలు కోల్పోయారు. అగర్తలాలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆయన తన సర్వీస్ తుపాకీతో కాల్చుకొని ఈ ఘాతుకానికి పాల్పడినట్టు తెలుస్తోంది. అయితే ఘటన జరిగిన వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు.. అక్కడికి చేరుకొని ఆయన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అగర్తలాలోని జీబీ ఆసుపత్రికి తరలించారు. రాష్ట్ర అత్యున్నత పోలీసు అధికారి ఇలా ఆకస్మికంగా, విషాదకర రీతిలో మరణించడం త్రిపుర పరిపాలన, శాంతిభద్రతల వర్గాల్లో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించడంతో. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. అనురాగ్ ధన్కడ్ ఆత్మహత్యకు గల తక్షణ కారణాలపై ఆరా తీస్తున్నారు. అలాగే సీనియర్ ఐపీఎస్ అధికారి మరణానికి దారితీసిన పరిస్థితులను నిర్ధారించడానికి ప్రభుత్వం త్వరలోనే ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా త్రిపుర కేడర్‌కు చెందిన 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన అనురాగ్ ధంకర్, 2025 మే నెలలో త్రిపుర డీజీపీ బాధ్యతలు స్వీకరించారు.

# విరహాగ్నితో రగిలి పోతున్న స్టార్ డాటర్



విరహాగ్నితో రగిలిపోతోంది. అందాల ఆరబోతతో వేడెక్కిస్తోంది. ఏదో ఒక సంథింగ్ తనలో ఉందని నిరూపించేందుకు నిరంతరం తనదైన శైలిలో తపన పడుతోంది. ఇంతకీ ఎవరీ స్టార్ డాటర్ అంటే.. ప్రత్యేకించి పరిచయం అవసరం లేదు. ది గ్రేట్ జాన్వీ కపూర్. పాతిక ప్రాయంలోనే ఈ భామ స్టార్ డమ్ ని ఆస్వాధిస్తోందంటే తన లెవల్ ని ఏ రేంజులో మెయింటెయిన్ చేస్తోందో అర్థం చేసుకోవచ్చు. ఒక నటవారసురాలిగా తనకి ఉన్న బ్యాకింగ్ దృష్ట్యా జాన్వీ ఇప్పటికే పోటీబరిలో దూసుకుపోతోంది. పాపా బోనీకపూర్.. కరణ్ జోహార్ సంయుక్తంగా జాన్వీ కెరీర్ ని తీర్చిదిద్దుతున్న సంగతి తెలిసిందే.తాజాగా జాన్వీ షేర్ చేసిన ఓ ఫోటోషూట్ అంతర్జాలంలో మంటలు పెడుతోంది. జాన్వీ ఈ లేటెస్ట్ ఫోటోషూట్ లో ఎంతో హాట్ గా కనిపిస్తోంది. జాన్వీ టెంప్టింగ్ లుక్ పై నెటిజనులు అంతే వేడిగా కామెంట్లు చేస్తున్నారు.

మిస్టర్ అండ్ మిసెస్ మహి.. వాట్ నెక్స్ట్!

జాన్వీ కపూర్ నటిస్తున్న తాజా చిత్రం మిస్టర్ మిసెస్ మహి సంచలనాలు ఖాయమని అర్థమవుతోంది. ఈ మూవీలో జాన్వీ క్రికెటర్ గా నటిస్తోంది. ఇందు కోసం దినేష్ కార్తీక్ సారథ్యంలో క్రికెట్ క్యాంప్ లో శిక్షణ పొందుతోంది. ఈ చిత్రం క్రికెట్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతోంది. మూవీ గురించి తెలుసుకోవాలని అభిమానులు ఆసక్తిగా ఉన్నారు. ఈ చిత్రంలో జాన్వీ రూహి సహనటుడు రాజ్కుమార్ రావ్ కూడా నటిస్తున్నారు. ఇంతకుముందు రిపబ్లిక్ డే 2022 (జనవరి 26) నాడు జాన్వీ తన ఇన్ స్టాలో క్రికెటర్గా నటించే అవకాశం రావడంపై ఆనందం ం వ్యక్తం చేసింది. ఆ లుక్ లో క్రికెట్ హెల్మెట్ ను ధరించి జాన్వీ కనిపించారు. వెటరన్ ఇండియన్ వికెట్ కీపర్-బ్యాట్స్ మన్ దినేష్ కార్తీక్ నెట్స్ లో ప్రాక్టీస్ చేస్తున్న దృశ్యాన్ని కూడా ఆమె షేర్ చేసింది. జాన్వీ -కార్తీక్- చిత్ర దర్శకుడు శరణ్ శర్మ- దినేష్ కార్తీక్కు సన్నిహితుడైన మాజీ భారత క్రికెటర్ అభిషేక్ నాయర్ లతో కలిసి ఉల్లాసంగా కనిపించింది. ఈ ఫోటోలు చూడగానే క్రికెట్ నేపథ్యంలో రూపొందుతున్న సినిమా ఇదని పూర్తి క్లారిటీ వచ్చేసింది.

# మహేష్ లో మళ్లీ పోకిరిని చూస్తామట!



మహేష్ బాబు హీరోగా కీర్తి సురేష్ హీరోయిన్ గా రూపొందుతున్న సినిమా సర్కారు వారి పాట. ఈ సినిమాకు సంబంధించిన చివరి దశ చిత్రీకరణ ఇటీవలే ప్రారంభం అయ్యింది. హైదరాబాద్ లో చివరి షెడ్యూల్ లో యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ఈ సినిమాలో మహేష్ బాబు పాత్ర ఏంటీ.. అసలు మహేష్ బాబు పాత్రకు బ్యాంకింగ్ రంగానికి ఉన్న లింక్ ఏంటీ అనే విషయాలు సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి. ఇప్పటి వరకు మహేష్ బాబు పాత్ర ఏంటీ.. ఆయన పాత్ర పేరు ఏంటీ అనే విషయాలను కూడా మేకర్స్ రివీల్ చేయలేదు. కాని తాజాగా విడుదల అయిన కళావతి పాట కు లిరిక్స్ అందించిన అనంత శ్రీరామ్ మాట్లాడుతూ సినిమా గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సినిమాలో మహేష్ బాబు పాత్ర చాలా కేర్ లెస్ గా.. ఏమాత్రం సమాజం గురించి పట్టనట్లుగా ఉంటుందట. అమ్మాయిలు ప్రేమ గురించి పట్టించుకోని వ్యక్తిగా కనిపిస్తాడట. అలాంటి ఒక వ్యక్తికి హీరోయిన్ కళావతి కనిపించిన వెంటనే గుండెల్లో కొత్త ఆలోచనలు మొదలు అవ్వడం.. ఆమె హగ్ ఇవ్వడంతో మతి పోయి ప్రేమలో పడటం జరుగుతుందట. మొదటి సారి హీరోయిన్ కళావతి హీరోకు హగ్ ఇచ్చిన సమయంలోనే ఆ పాట ఉంటుందని ఆయన చెప్పుకొచ్చాడు. అనంత శ్రీరామ్ చెబుతున్న దాని ప్రకారం ఈ సినిమాలో హీరో పాత్ర పోకిరి సినిమాలో హీరో పాత్ర తరహాలో ఉందనే టాక్ వినిపిస్తుంది. దర్శకుడు పరశురామ్ తో పాటు ఇతర చిత్ర యూనిట్ సభ్యులు సినిమా గురించి మాట్లాడిన సమయంలో మహేష్ బాబు పాత్ర పోకిరిలో పండుగాడు తరహాలో ఉంటుందని చెప్పుకొచ్చారు. సినిమాలో మొత్తం అయిదు పాటలకు గాను నాలుగు పాటలు అనంత శ్రీరామ్ రాసినట్లుగా చెప్పుకొచ్చాడు. సినిమాలోని హీరో పాత్ర విషయంలో ఆయన చేసిన వ్యాఖ్యలు సినిమా స్థాయిని మరింతగా పెంచినట్లు అయ్యింది. గీత గోవిందం సినిమా తర్వాత పరశురామ్ దర్శకత్వంలో వస్తున్న సినిమా అవ్వడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. సర్కారు వారి పాట సినిమా ను సమ్మర్ లో విడుదల చేయబోతున్నట్లుగా ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. కీర్తి సురేష్ మరియు మహేష్ బాబు ల కాంబోలో రూపొందుతున్న ఈ సినిమా పై మొదటి నుండి అంచనాలు ఉన్నాయి. అంచనాలకు తగ్గట్లుగానే ఈ సినిమా ఉంటుందని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రభాస్ పాన్ వరల్డ్ మూవీ షూటింగ్ లేటెస్ట్ అప్డేట్..!




11వ తారీఖున ప్రభాస్ నటించిన 'రాధే శ్యామ్' సినిమా విడుదల కానున్న నేపథ్యంలో.. డార్లింగ్ ఆ మూవీ ప్రమోషన్స్ లో పాల్గొనేలా షెడ్యూల్ రెడీ చేసుకున్నారని తెలిసింది. "ప్రాజెక్ట్ K" చిత్రాన్ని పాన్ వరల్డ్ స్థాయిలో పలు ప్రధాన భాషల్లో రూపొందిస్తున్నారు.

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ - బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొనే హీరోహీరోయిన్లుగా ఓ భారీ ప్రాజెక్ట్ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. మహానటి ఫేమ్ నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో బిగ్ బి అమితాబ్ బచ్చన్ కీలక పాత్ర పోషిస్తున్నారు."ప్రాజెక్ట్ K" అనే వర్కింగ్ టైటిల్ తో ఈ చిత్రాన్ని సెట్స్ మీదకు తీసుకెళ్లారు. ఇప్పటికే ఈ సినిమా రెండు కీలకమైన షెడ్యూల్స్ చిత్రీకరణ పూర్తి చేసుకుంది. అయితే ఈ మూవీ షూటింగ్ కు సంబంధించి లేటెస్ట్ అప్డేట్ బయటకు వచ్చింది. "ప్రాజెక్ట్ K" సినిమా తాజా షెడ్యూల్ ను 21 రోజుల పాటు ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ప్రభాస్ తో పాటుగా అమితాబ్ బచ్చన్ - దీపికా పదుకొనే కూడా చిత్రీకరణలో పాల్గొంతున్నారని సమాచారం. వచ్చే నెల






మీనాక్షీ చౌదరి హాట్ టాప్

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com